లక్ష్మీనరసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, మే15: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో స్వయంభువుకు బుధవారం నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభు నారసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభు ప్రధానాలయంలో స్వామివారికి నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్లకు సుదర్శన నారసింహహోమం, గజ వాహనసేవ, నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవను వైభవంగా చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.28,15,904 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

సత్తయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల సాయం

సంస్థాన్ నారాయణపురం, మే15 : మండల కేంద్రానికి చెందిన సికిలమెట్ల సత్తయ్య ఇటీవల మృతి చెందాడు. అతడిది నిరుపేద కుటుంబం కావడంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ శ్రీహరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేలు, క్వింటా బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తెలంగాణ భిక్షం, లారీ భిక్షం, పీఏసీఎస్ డైరెక్టర్ బొడ్డుపల్లి గాలయ్య, నాయకులు ఎడ్ల సత్తయ్య, వడ్డేపల్లి రాములు, ఉప్పల శ్రీను, ముత్యాలు, చిలువేరు శంకర్, కృష్ణయ్య, జనగాం నరసింహ పాల్గొన్నారు.

2500 ఎకరాలే లక్ష్యంగా..

హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్

- ఇబ్రహీంపట్నం లేక్ ఫ్రంట్
- ఏరియా డెవలప్‌మెంట్
- ప్రాజెక్టు కోసం భూసమీకరణ

సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ): ఒక ప్రాంతాన్ని సమగ్రంగా.. అన్ని రంగాల్లో అభివృద్ధికి కేంద్ర బిందువుగా మార్చేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) చర్యలు చేపట్టింది. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా పని చేస్తున్న హెచ్ఎండీఏ ఏరియా డెవలప్‌మెంట్ మాస్టర్ ప్లాన్‌లు రూపొందించి, అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. దక్షిణ హైదరాబాద్ ప్రాంతంలో ఉన్న ఇబ్రహీంపట్నం చుట్టు పక్కల ప్రాంతాలతో కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ద్వారా పట్టా భూముల రైతులతో పాటు ప్రభుత్వ అసైన్డ్ భూములు, ఇతర ప్రభుత్వ భూములతో కలిపి భారీ విస్తీర్ణంతో కూడిన ప్రాజెక్టును చేపట్టనున్నది. ఇందులో భాగంగానే ఇబ్రహీంపట్నం చెరువును కేంద్రంగా చేసుకొని.. 'ఇబ్రహీంపట్నం లేక్ ఫ్రంట్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రాజెక్టు'ను హెచ్ఎండీఏ మొదలు పెట్టింది. ల్యాండ్ పూలింగ్ విభాగం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ పరిధిలోకి వచ్చే ఐదు గ్రామాలకు చెందిన రైతులతో ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ, భూములను సేకరించే పనిని ప్రారంభించింది.

2500 ఎకరాలే లక్ష్యంగా..

నగరానికి సమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నం ప్రాంతం ఔటర్‌రింగ్ రోడ్డుతో పాటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి దగ్గరలో ఉన్నది. ఒకవైపు నాగార్జునసాగర్ హైవే, మరోవైపు శ్రీశైలం హైవే, వీటి మధ్యలోనే రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్ ఉండటంతో ఈ ప్రాంతాన్ని ఒక ప్రాజెక్టుగా చేపట్టనున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును సుందరీకరణ చేయడంతో పాటు చెరువులో బోట్ షికారుతో పాటు కాటేజీల నిర్మాణం వంటివి చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం గత ప్రభుత్వం రూ.11 కోట్లను సైతం కేటాయించింది. చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చెరువు కట్టను వెడల్పు చేసి, చెరువు వైపు వాకర్ పార్కుతో పాటు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పలు కార్యక్రమాలు చేపట్టేందుకు గతంలోనే ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకు అనుగుణంగా నిధులు కూడా కేటాయించారు. అప్పటి నుంచి ఎచ్ఎండీఏ ఆధ్వర్యంలో చెరువు అభివృద్ధితో పాటు పరిసర ప్రాంతాలను కూడా అభివృద్ధి చేసేలా లేక్ ఫ్రంట్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రాజెక్టును చేపట్టారు. ఇందుకోసం ఒకేచోట 2500 ఎకరాలకు తక్కువ కాకుండా భూములను సమీకరించాలని నిర్ణయించి, ల్యాండ్ పూలింగ్ విభాగం అధికారులు ఐదు గ్రామాల పరిధిలోని రైతులతో ఇప్పటికే పలు మార్లు సమావేశమయ్యారు. రైతుల అంగీకారంతోనే భూములను సమీకరించేలా చేస్తున్నారు. పట్టా భూములు ఇచ్చే రైతులకు ఒక ఎకరానికి 1740 గజాల స్థలాన్ని అభివృద్ధి చేసిన తర్వాత ఇస్తుండగా, ప్రభుత్వ అసైన్డ్ భూములను సేకరిస్తే అందులో ఉండే రైతుకు 600 గజాల అభివృద్ధి చేసిన స్థలాన్ని కేటాయించనున్నారు. ఈ విధంగా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు పరిసర గ్రామాలైన ఇబ్రహీంపట్నం భగాయత్, ఇబ్రహీంపట్నం ఖాల్సా, ఉప్పరిగూడ, పోచారం, కప్పాడు, చర్లపటేల్‌గూడ గ్రామాల్లో సమీకరించే 2500 ఎకరాల్లో రకరకాల కార్యకలాపాలకు అనుగుణంగా లే అవుట్‌లను అభివృద్ధి చేయనున్నది.

పరిశ్రమలు, నివాసాల కోసం లేఅవుట్లు..

ఇబ్రహీంపట్నం చెరువు చుట్టు పక్కల సేకరించే భూము ల్లో కొంత భాగంలో ఇండ్ల నిర్మాణం కోసం వెంచర్ల ఏర్పా టు చేస్తుండగా, మరికొంత భాగంలో ఐటీ సెక్టార్లు, ఇతర పరిశ్రమలను ఏర్పాటు చేసేలా ప్రాజెక్టును రూపొందించారు. ఈ విధంగా ఒకే చోట పరిశ్రమలు, నివాసాలు రావడంతో ఆ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెంది.. ఒక శాటిలైట్ టౌన్‌షిప్ మాదిరిగా మారేందుకు అవకాశం ఉంటుందని హెచ్ఎండీఏ ప్రణాళికా విభాగం అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో టీసీఎస్, ఎరోస్పేస్ వంటి అతిపెద్ద పరిశ్రమలు కూడా ఏర్పాటయ్యాయి. దీంతో ఎచ్ఎండీఏ అధికారులు ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికతో కార్యాచరణ రూపొందించి, అమలు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు.

కుక్కను ఉసిగొల్పారంటూ.. దాడి.. ప్రతిదాడి

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ.. ఐదుగురు నిందితుల అరెస్టు

వెంగళరావునగర్, మే 15 : పెంపుడు కుక్క విషయంలో తలెత్తిన వివాదంతో రెండు కుటుంబాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఈ దాడిలో ఓ కుటుంబానికి చెందిన వారు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. కుక్కకు కూడా బలంగా దెబ్బలు తగిలాయి. ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని రహ్మత్ నగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్ నివాసి మధు కుటుంబం హస్కీ జాతికి చెందిన కుక్కను పెంచుకుంటున్నారు. ఈ నెల 8న పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు మధు కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయలుదేరారు. ఆ సమయంలో పెంపుడు కుక్క కూడా వీరితో పాటు బయటకు వచ్చి.. నిర్మాణంలో ఉన్న ఎదురింటి ధనుంజయ్ ఇంటి ఆవరణలోకి వెళ్లింది. కుక్కను తమపై ఉసిగొల్పారంటూ ధనంజయ్ కుటుంబ సభ్యులు గొడవకు దిగారు. ఈ గొడవపై రెండు కుటుంబాలు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో కోపం పెంచుకున్న ధనుంజయ్ ప్రతీకారంతో రగిలిపోయాడు. దాడి చేసేందుకు అవకాశం కోసం వేచి చూస్తున్నాడు. ఇదిలా ఉండగా.. మంగళవారం సాయంత్రం మధు సోదరుడైన శ్రీనాథ్ కుక్కను తీసుకుని వాకింగ్‌కు బయలుదేరాడు. ఇది చూసిన ధనుంజయ్ మరో నలుగురితో కలిసి వచ్చి ఇంటి గేటు వద్ద ఉన్న కుక్కను ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా కొట్టాడు. ప్రాణంలా చూసుకునే కుక్కను ధనుంజయ్ కొడుతుంటే.. శ్రీనాథ్, అతడి కుటుంబ సభ్యులు కుక్కను కాపాడే ప్రయత్నంలో అడ్డుకున్నారు. దీంతో మరింత రెచ్చిపోయిన ధనుంజయ్‌తో సహా ఐదుగురు వ్యక్తులు మూకుమ్మడిగా మధు కుటుంబీకులపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో మధు సోదరుడు శ్రీనాథ్‌తో పాటు అతడి తల్లి రాజేశ్వరి, అతడి మరదలు స్వప్నను కూడా ఇనుప రాడ్లతో కొట్టి తీవ్రంగా గాయపర్చారు. దెబ్బలతో కుక్కతో పాటు కుటుంబ సభ్యుల పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం అందరిని దవాఖానకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడికి పాల్పడిన ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- కేంద్రం ప్రారంభించి 45 రోజులు దాటినా పూర్తిగాని కొనుగోళ్లు
- అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులకు తీవ్ర నష్టం

ఆత్మకూర్(ఎం) సబ్‌మార్కెట్ యార్డులో ఉన్న ధాన్యం రాశులు

ఆత్మకూరు(ఎం), మే15 : మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్‌యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాన్ని 45 రోజుల క్రితం ప్రారంభించారు. ఐనా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రంలో 40 మంది రైతులకు సంబంధించిన 7 వేల బస్తాల ధాన్యం నిల్వ ఉంది. వారంతా కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 40 రోజులు గడుస్తున్నప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో సదరు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం ఎండకు ఎండి వర్షానికి తడుస్తుండడంతో ఆరబెట్టుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీల కొరతతో నిర్వాహకులు కొనుగోళ్లను ఆలస్యం చేస్తుండడంతో పగలు, రాత్రి అక్కడే పడిగాపులు కాయాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సిరియల్ ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉన్నా నిర్వాహకులు మాత్రం తమకు నచ్చిన విధంగా.. రాజకీయ నాయకులకు సంబంధించిన ధాన్యాన్ని ముందుగా కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడే ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేశారని, ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు. ఈ విషయమై కేంద్రం నిర్వాహకురాలు శిరీషను వివరణ కోరగా ఇప్పటి వరకు 80 మంది రైతులకు సంబంధించిన 29,241 బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. లారీల కొరత కారణంగా ధాన్యం తూకాల్లో కొంత జాప్యం జరుగుతున్నదని పేర్కొన్నారు.

మాగోడు ఎవరూ పట్టించు కోవట్లేదు

యాసంగిలో నేను పండించిన 300 బస్తాల వరి ధాన్యాన్ని 40 రోజుల క్రితం మార్కెట్‌యార్డుకు తెచ్చి పోశాను. ఇప్పటి వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కేంద్రం నిర్వాహకులు ఇబ్బంది పెడుతున్నరు. పలుకుబడి కలిగిన వారి ధాన్యాన్ని ముందుగా కొనుగోలు చేస్తూ.. మాములు రైతులను పట్టించుకోవడం లేదు. అకాల వర్షాలతో ఇప్పటికే రెండు సార్లు ధాన్యం తడిసింది. పగలు, రాత్రి ధాన్యం కాడనే కాపుగాయాల్సి వస్తున్నది. ఇప్పటికైనా ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

–నాగం శ్రీనివాస్‌రెడ్డి, రైతు, ఆత్మకూరు(ఎం)

సీబీఎస్ఈ ఫలితాల్లో కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

భువనగిరి అర్బన్, మే 15 : ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ ఫలితాల్లో భువనగిరి కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఎన్. చంద్రమౌళి తెలిపారు. బుధవారం విద్యార్థులను అభినందించి మాట్లాడారు. పాఠశాలకు చెందిన 39 మంది విద్యార్థులు బోర్డు పరీక్షకు హాజరు కాగా అందరూ ఉత్తర్ణులై 100 శాతం ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. ఇందులో మొత్తం 500 మార్కులకు గానూ పబ్బ భవ్యశ్రీకి 445, పాకాల సహస్ర 444, ఎం. దివ్యసాయి 432 మార్కులు సాధించినట్లు చెప్పారు. నేషనల్ హైవే 163 సమీపంలో నిర్మించిన నూతన భవనం వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభంకానున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు చర్యలు

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భువనగిరి కలెక్టరేట్, మే 15 : అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని, రైతుల ఇబ్బందులు తీర్చేందుకు జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్ తెలిపారు. జిల్లాలోని సూరేపల్లి, పచ్చర్లబోడు తండా, గూడూర్ గ్రామ రైతుల ఆందోళన దృష్ట్యా బుధవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల పరిధిలో ధాన్యం తడిసిన విషయం వాస్తవం కాదని, స్థలాభావం, వరుస సెలవుల కారణంగా కొంత మేరకు ధాన్యం కొనుగోళ్లు మందగించాయని ఆయన పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడుతున్నందున కొనుగోళ్లు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మిల్ పాయింట్ల వద్ద స్థలాభావం ఉన్నప్పటికీ, దానిని అధిగమించడానికి సమీప జిల్లాలైన నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు ధాన్యం తరలిస్తున్నట్లు చెప్పారు. జనగామ, హనుమకొండ జిల్లాలకు కూడా 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ట్యాగింగ్ చేసినట్లు తెలిపారు. లారీల కొరత ఏమీ లేదని, ఎన్నికల దృష్ట్యా కేంద్రాలు, మిల్లుల వద్ద తగినంత మంది హమాలీలు లేక లారీల రాకలో జాప్యం జరిగిందని పేర్కొన్నారు. రవాణా సజావుగా సాగుతుందని తెలిపారు. అకాల వర్షాలకు ధాన్యం తడువకుండా కొనుగోలు కేంద్రాల వద్ద తగినన్ని టార్పాలిన్లు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.

రైతాంగం కూడా కేంద్రంలో ఉన్న తమ వరి కుప్పలపై పట్టా కప్పి పెట్టుకునే విధంగా అధికారులు చూడాలన్నారు.

నేల చల్లబడ్డాకే సాగు మొదలు పెట్టాలి

- తొలకరి చినుకులకే నాటి నష్టపోవద్దు
- రెండు మూడు వర్షాలు పడే వరకు ఆగాలి
- రైతు అవగాహన సదస్సులో ఏడీఆర్ మల్లారెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఆర్ మల్లారెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, మే 15 : రెండు మూడు వర్షాలు పడి నేల చల్లబడ్డాకే వానకాలం సాగుకు ఉపక్రమించాలని, తొలకరి చినుకులకే విత్తనాలు నాటి నష్టపోవద్దని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఉపసంచాలకుడు (ఏడీఆర్) డాక్టర్ మల్లారెడ్డి రైతులకు సూచించారు. రైతులు తమకు సమీపంలో ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు తీసుకొని సాగుకు ఉపక్రమించాలని చెప్పారు. సమతుల్య వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది వానకాలంలో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సమతుల్య సాగు అవసరమన్నారు. నీటి సాంకేతికతకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు తీసుకోవాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేసే సమయంలో అధికారులతో సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్హత గల డీలర్ వద్దనే కొనుగోలు చేయాలని, తప్పని సరిగా రసీదు తీసుకొని పంట కోత కొచ్చే వరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. మూస పద్ధతిన సాగు చేస్తే అపార నష్టాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. అనంతరం నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం సంచాలకుడు డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఉద్యాన పంటలు, కూరగాయలు, పూల తోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు ప్రేమ్ సింగ్, శేఖర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆలేరురూరల్, మే15 : మండలంలోని గుండ్లగూడెం గ్రామానికి చెందిన జూకంటి ప్రేమానందం బుధవారం మృతి చెందాడు. మాజీ సర్పంచ్ ఏసీరెడ్డి మహేందర్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కారు ఢీకొని ఒకరి దుర్మరణం

తుర్కపల్లి, మే15 : కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని వాసాలమర్రి గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ తకియొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు గ్రామానికి చెందిన చిన్నగారి మైపాల్‌రెడ్డి (36), భార్య నవితతో కలిసి బైక్‌పై భువనగిరి వైపు వెళ్తున్నాడు. వాసాలమర్రి గ్రామ సమీపంలో భువనగిరి నుంచి జగదేవ్‌పూర్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దాంతో బైక్‌పై ఉన్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వారిని 108 వాహనంలో భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొం దుతూ మైపాల్‌రెడ్డి మృతి చెందాడు. నవిత ఆరోగ్యం విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రేమ కథ విషాదాంతం

- మూడు నెలల క్రితం భార్య ఆత్మహత్య.. ఇప్పుడు ఉరేసుకొని భర్త బలన్మరణం

బీబీనగర్, మే 15 : వారిద్దరూ ప్రేమించుకొని పెద్దలను ఎదురించి కులాంతర వివాహం చేసుకున్నారు. కానీ వారి పెండ్లిని అంగీకరించని ఇరు కుటుంబాల మధ్య కలహాలు చోటు చేసుకోవడంతో మూడు నెలల క్రితం యువతి ఆత్మహత్యకు పాల్పడింది. అందుకు బాధ్యుడిని చేస్తూ భర్తను జైలుకు పంపడంతో మనస్తాపంతో అతను కూడా బుధవారం బీబీనగర్‌లోని ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఎన్. రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం చీమలకొండూరు గ్రామానికి చెందిన బిట్కూరి మనోహర్ (25) అదే గ్రామానికి చెందిన భూమిక ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో వారి వివాహానికి పెద్దలు అంగీకరించలేదు. దాంతో ఇద్దరూ పెద్దలను ఎదురించి ఐదు నెలల క్రితం పెండ్లి చేసుకున్నారు. దాంతో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతుండడంతో మనస్తాపం చెందిన భూమిక మూడు నెలల క్రితం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భార్య ఆత్మహత్య కేసులో మనోహర్ రెండు నెలల పాటు జైలుకు వెళ్లి నెల రోజుల క్రితం బయటికి వచ్చాడు. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతున్నాడు. బుధవారం బీబీనగర్ పట్టణ కేంద్రంలోని వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు.

మనోహర్ తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి జైలు

భూదాన్‌పోచంపల్లి, మే 15 : పట్టణ కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన జింకల శ్రీకాంత్ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన నేరానికి ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ చౌటుప్పల్ కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బుధవారం స్థానిక ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు తెలిపారు. భూదాన్ పోచంపల్లికి చెందిన జింకల శ్రీకాంత్ పట్టణానికి చెందిన మహిళపై 2016లో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ జగన్మోహన్ రెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో రిమాండ్ చేశారు. కానిస్టేబుల్ సాయికుమార్, హోంగార్డ్ శివకుమార్ ఈ కేసుకు సంబంధించిన సాక్షాలను కోర్టుకు అందజేశారు. మంగళవారం ఈ కేసును విచారించిన చౌటుప్పల్ కోర్టు జడ్జి నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

- డీఎంహెచ్ఓ పాపారావు

కేకే నర్సింగ్ హోమ్‌లో రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

భువనగిరి అర్బన్, మే 15 : ప్రైవేటు ఆస్పత్రులు సాధారణ ప్రసవాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై.పాపారావు సూచించారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం డీఎంహెచ్ఓ, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, ప్రోగ్రాం అధికారుల బృందం పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనకు విరుద్ధంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు తగ్గించి సిజేరియన్‌లు అధికంగా చేస్తున్నారన్నారు. సిజేరియన్ వల్ల తల్లుల్లో అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. తగిన కారణాలు లేకుండా సిజేరియన్ చేసినట్లయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఆయా ఆస్పత్రుల్లో రికార్డులు పరిశీలించారు. సరైన కారణాలు పొందుపర్చకుండా సిజేరియన్ చేసిన, నిబంధనలు పాటించని ప్రిన్స్, గాయత్రి, మహేంద్ర ఆస్పత్రులకు నోటీసులు అందించినట్లు తెలిపారు. ముహూర్తాలు, మంచి రోజులని, సిజేరియన్‌కు మొగ్గు చూపకూడదని, డాక్టర్ సూచించిన సమయం వరకు ఆగి సాధారణ ప్రసవాలు చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. జిల్లాలో సిజేరియన్ చేస్తున్న ఆస్పత్రుల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు డా.శిల్పిని, డాక్టర్ యశోద, ప్రోగ్రాం అధికారులు డా.సుమన్ కళ్యాణ్, మధుసూదన్‌రెడ్డి, సీహెచ్ఓ నగేశ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

చౌటుప్పల్ : కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటాలను పరిశీలిస్తున్న దామోదర్‌రెడ్డి

కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్, మే 15 : కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి సూచించారు. బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లుల వద్ద ఆగి ఉన్న లారీలను అన్‌లోడు చేయించి, గన్నీ బస్తాలు కొనుగోలు కేంద్రాలకు పంపించాలని సంబంధిత అధికారులను కోరారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట సింగిల్ విండో డైరెక్టర్ దొడ్డి శ్రీశైలం, రైతులు ఉన్నారు.

కొలనుపాకలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నీటి ఎద్దడి తీర్చాలని మహిళల నిరసన

ఆలేరురూరల్, మే 15 : మండలంలోని కొలనుపాక మేజర్ గ్రామపంచాయతీలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. నీటి ఎద్దడి తీవ్రమై తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సోమరాజమ్మ, సుజాత, రమాదేవి, భారతమ్మ, అండాలు, రేవతి, గ్రామస్తులు పాల్గొన్నారు.